## క్లుప్తంగా

### అంధ బాలికల పాఠశాలలో షెడ్ ప్రారంభం



మొక్కలు నాటుతున్న క్లబ్ సభ్యులు

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధబాలికల పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రూ. 3.5 లక్షలతో ఏర్పాటు చేసిన షెడ్‌ను గురువారం ఇన్నర్ వీల్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ ఎ.లక్ష్మీ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రాగణంలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ షెడ్ నిర్మాణానికి సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ నూర్జహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

### 'హెచ్ఐవీ'పై విద్యార్థులకు అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న చిట్టివలస హైస్కూల్ విద్యార్థులు

తగరపువలస: హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం చిట్టివలస, చిప్పాడ జెడ్పీ హైస్కూళ్లలో మీకు తెలుసా కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. లింక్ వర్కర్ స్కీం సీఎల్‌డబ్ల్యూ ఎం.జ్యోతి మాట్లాడుతూ లైంగికంగా సంక్రమించే వ్యాధులపై రెండు నెలల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమాలలో ప్రధానోపాధ్యాయిని సీహెచ్.రోజామణి, ఎం.వి.టి.రత్నం, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా నిర్మల



బాధ్యతలు స్వీకరించిన గుల్లిపల్లి నిర్మల

మధురవాద: మహిళలకు మరింత అందుబాటులో ఉండడమే కాకుండా ఇబ్బందుల్లో ఉన్నవారు ఏ సమయంలోనైనా తమను సంప్రదించవచ్చని ఎండాడ మహిళా(దిశ) పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గుల్లిపల్లి నిర్మల చెప్పారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన కల్యాణి వీఆర్‌కి అటాచ్ కావడంతో ఆమె స్థానంలో శ్రీకాకుళం డీటీసీ నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐలు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

### పంచాయతీలకు బ్లీచింగ్ పౌడర్ అందజేత



బ్లీచింగ్ పౌడర్‌ను అందిస్తున్న దివీస్ ప్రతినిధులు

భీమునిపట్నం: పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు దివీస్ సంస్థ బ్లీచింగ్ పౌడర్ అందించింది. భీమిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులకు సంస్థ సీఎస్ఆర్ ప్రతినిధి డి. సురేష్‌కుమార్ వీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ రూ.4.20 లక్షల విలువ చేసే 270 బ్లీచింగ్ పౌడర్ బస్తాలను అందించినట్లు చెప్పారు. గ్రామాల్లో వ్యాధులు వ్యాప్తి చెందకుండా సామాజిక బాధ్యతగా వీటిని అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు, దివీస్ ప్రతినిధులు నర్సింహ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# సుందర తీరం.. సౌకర్యాలు శూన్యం

- ఎర్రయ్యపాలెం తీరంలో కానరాని వసతులు
- పర్యాటకుల అవస్థలు

తగరపువలస: ఆహ్లాదకర తీరంలో కనీస వసతులు లేక పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. భీమిలి–విశాఖ ప్రాంతంలో బీచ్‌ల తరువాత పర్యాటలను ఎక్కువగా ఆకర్షించేది భీమిలి మండలంలోని అన్నవరం పంచాయతీకి చెందిన ఎర్రయ్యపాలెం తీర ప్రాంతం. ఈ ప్రాంతంలో సముద్రంపై బిర్లా యాజమాన్యం నిర్మించిన జెట్టీ ప్రధాన ఆకర్షణ. దీంతో సీజన్‌తో సంబంధం లేకుండా నిత్యం పర్యాటకులు ఎర్రయ్యపాలెం వైపు పరుగులు తీస్తుంటారు. తీరా ఇక్కడకు వచ్చేసరికి ఎలాంటి వసతులు లేకపోవడంతో అంతలోనే వెనుదిరుగుతుంటారు.

**ఆహ్లాదకరంగా పాండవుల పంచ**

ఎర్రయ్యపాలెం బీచ్‌కు అత్యంత చేరువలో ఉన్న పాండవుల పంచ పర్యాటకులకు ఆహ్లాదం కలిగించే ప్రాంతం. ఇక్కడ ఒక వైపు సముద్రం, మరో వైపు సముద్ర అలలు, తీర ప్రాంత గాలులు చెక్కిన ఎర్రటి గుట్టలు మైమరిపిస్తుంటాయి. గుట్టల వరకు వచ్చిన అలలు పాలనురుగును కక్కుతూ వెనక్కు వెళ్లే అందాలు అద్భుతమని కొనియాడని వారు ఉండరు. ఇక్కడికి దగ్గరలోనే ఒబెరాయ్ యాజమాన్యం సెవెన్ స్టార్ హోటల్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో భూమిపూజ కూడా చేసింది. ఇంతలా పర్యాటకులను ఆకర్షిస్తున్న ఈ ప్రాంతంలో కనీస వసతులు అయిన తాగునీరు, టాయిలెట్లు వంటి వాటి కోసం అటు ప్రభుత్వం కాని, పంచాయతీ పాలకవర్గం కానీ పట్టించుకోవడం లేదు. దీంతో స్థానిక మత్స్యకార గ్రామానికి చెందిన ఒక మహిళే ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరు తినుబండారాలు విక్రయిస్తూ కొంతవరకు ఉడతా సాయం అందిస్తుంది.

ఎర్రయ్యపాలెం నుంచి కిలోమీటరు దూరం ఇసుకలో నడిచి వెళ్లడం లేదంటే కొత్తపేట నుంచి మట్టి రహదారి ద్వారా జెట్టీకి చేరుకోవచ్చు. ఈ ప్రాంతంలో అటవీశాఖకు చెందిన ప్రదేశంలో సరుగుడు, జీడి చెట్లు ఉన్నాయి. పర్యాటకులకు మరేమీ వసతులు లేని కారణంగా ఇక్కడే కాసేపు సేదతీరి వెళ్లిపోతుంటారు.



అపారిశుద్ధ్యంగా ఎర్రయ్యపాలెం బీచ్‌లోకి ప్రవేశించే మార్గం



వసతులు లేని విశాలమైన బీచ్



అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెం తీరంలో కనువిందు చేసే జెట్టీ కిందభాగం

**ఈ వసతులు కల్పిస్తే..**

జెట్టీకి చేరువలోని ఈ ప్రాంతంలో పర్యాటకుల కోసం షెల్టర్లు, టాయిలెట్లు, కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు, తాగునీరు వంటివి ఏర్పాటు చేయాలి. ప్రైవేట్ భాగస్వామ్యంతో టీ, కాఫీ, స్నాక్స్, పేపర్ ప్లేట్ వంటి విక్రయించేలా షాపులు ఏర్పాటు చేయాలి. పర్యాటకుల నుంచి నామమాత్రపు రుసుం వసూలు చేసి వసతులు కల్పించాలని కోరుతున్నారు. అలాగే ఎర్రయ్యపాలెం గ్రామానికి దూరంగా ఉన్న ఈ జెట్టీ వద్ద అసాంఘిక చర్యలు, ఆత్మహత్యలు, పర్యాటకులపై దాడులు జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**నిరాశతో వెనక్కి..**



ఎర్రయ్యపాలెం తీరంలో జెట్టీ పర్యాటకులకు ఆహ్లాదం కలిగిస్తుంది. కానీ కాసేపు ఇక్కడ ఉండాలంటే ఎలాంటి వసతులు కనిపించడం లేదు. ఎండొచ్చినా, వానొచ్చినా జెట్టీ కిందే ఉండాలి. అందుకే చాలా మంది ఇలా వచ్చి అలా వెళ్లిపోతుంటారు. సౌకర్యాలు కల్పిస్తే ఎక్కువమంది పర్యాటకులు వస్తారు.

– కోరాడ ఆదినారాయణ,
తర్లువాడ, ఆనందపురం మండలం

## గ్రంథాలయ ఫర్నిచర్‌కు రూ.23 వేలు సాయం



గ్రంథాలయ ప్రారంభోత్సంలో కలిగొట్ల శ్రీరామ్

తగరపువలస: తాటితూరు జెడ్పీ హైస్కూల్లో కొత్తగా ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో ఫర్నిచర్‌కు భీమిలికి చెందిన కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ రూ.23 వేలు అందించింది. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ఈ మొత్తాన్ని ప్రధానోపాధ్యాయుడు డొకర శ్రీనివాసరావుకు గురువారం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, పతివాడ రాంబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ బుడుమూరి సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ నగరంపాలెం 11కేవీ ఫీడ పరిధిలో నిర్వహణ, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి తెలిపారు. ఈ కారణంగా గణేష్‌నగర్, పోర్టుకాలనీ, కళానగర్, బొట్టవానిపాలెం, స్వతంత్రనగర్, డాక్‌యార్డు కాలనీ, వాంబేకాలనీ, శ్రీనివాసనగర్, నగరంపాలెం పరిసర ప్రాంతాల్లో పైన తెలిపిన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

# ఏచూరికి ఘన నివాళులు



చిట్టివలస సిటూ కార్యాలయం వద్ద ఏచూరి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి ఏచూరి సీతారాం మృతి పట్ల భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు గురువారం సాయంత్రం సంతాపం వ్యక్తం చేశారు. చిట్టివలస సిటూ కార్యాలయం వద్ద జరిగిన సంతాపసభలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. నివాళులు అర్పించిన వారిలో జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి, ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, నీలాతి రాము, పెంటరాజు, రామకృష్ణ, పంపాన సూర్యనారాయణ, మావూరి వీర్రాజు, చిన్నారావు తదితరులు ఉన్నారు.

**ఆనందపురంలో..**

మండలంలోని వేములవలస కూడలిలో రమాబాయి అంబేడ్కర్ కళాశాల సంక్షేమ సంఘం ముఠా కార్మికులు ఏచూరికి నివాళులు అర్పించారు. సంఘం అధ్యక్షుడు ఉప్పాడ శివశంకర్, అయితి బంగారునాయుడు, ఉప్పాడ అప్పన్న, మన్యాల సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

**ఏచూరి సేవలు ఎనలేనివి**

మధురవాద: కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి పార్టీకి, ప్రజా ఉద్యమాలకు చేసిన సేవలు ఎనలేనివని సీపీఎం నాయకులు అన్నారు. కొమ్మాది జంక్షన్ వద్ద గల సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి మౌనం పాటించారు. శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం నాయకులు డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్, బి.భారతి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఈకేవైసీ



మద్దిలో ఈకేవైసీ చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో ఈ పంట నమోదులో భాగంగా గురువారం గ్రామ వ్యవసాయ సహాయకులు ఈకేవైసీ చేశారు. రేవిడి, మద్ది, కృష్ణాపురం, విలాస్కాన్‌పాలెం గ్రామాల్లో రైతులకు ఈ కేవైసీ చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# గణనాయకాయ.. గణదైవతాయ..

గణనాయకాయ గణదైవతాయ గణాధ్యక్షాయ ధీమహి.. అంటూ గణేశుని సంకీర్తనలతో గణపతి మండపాలు ప్రతిధ్వనిస్తున్నాయి. వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం పలు ప్రాంతాల్లో కుంకుమ పూజలు, అన్నసమారాధనలు నిర్వహించారు. ఘనంగా శోభాయాత్రలు నిర్వహించి, శివపుత్రుని గంగమ్మ ఒడికి చేర్చారు.



గాయత్రీ నగర్‌లో దీపోత్సవం



ఆదిత్యనగర్‌లో పూజలు చేస్తున్న చిన్నారులు, కమిటీ సభ్యులు



శోభాయాత్రలో మహిళల కోలాటం



సంగివలసలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో..



వలందపేట విద్యా బాలగణపతి యూత్ కమిటీ ఆధ్వర్యంలో..



వలందపేట హైవే వద్ద ఆకట్టుకుంటున్న గణపతి



తాళ్లవలస ఎస్సీ కాలనీ మండపంలో ..



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

మధురవాద/తగరపువలస: గణపతి శోభాయాత్రలు, అన్న ప్రసాదాల పంపిణీ కార్యక్రమాలను గురువారం పలు చోట్ల విశేషంగా నిర్వహించారు. మధురవాడ రైతు బజార్‌లో ఎస్టేట్ ఆఫీసర్ జగదీష్ అన్నసమారాధన ప్రారంభించారు. కోలాటం, బాజా భజంత్రీలతో శోభాయాత్ర నిర్వహించారు.

- నగరంపాలెం రోడ్డులోని ఆదిత్యనగర్, మిథిలాపురి ఉడా కాలనీ స్ప్రింగ్ వ్యూ అపార్ట్‌మెంట్‌తో పాటు మధురవాడలో చిన్నారులు ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాలను నిమజ్జనం చేశా రు. లడ్డూను వేలంపాటలో బి.అశోక్ కుమార్ దంపతులు కైవసం చేసుకున్నారు.

**కుంకుమార్చన**

భీమునిపట్నం: ఎగువపేట వద్ద క్యాపిటల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద కుంకుమ పూజలు చేశారు. మూడో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, 50 మంది మహిళలు పాల్గొన్నారు,

**మూడు గ్రామాల్లో అన్నదానం**

పద్మనాభం: శేరిఖండం, కృష్ణాపురం, పద్మనాభం గ్రామాల్లో గురువారం అన్నదానాలు జరిగాయి. పద్మనాభంలో అన్నదానాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

**కనులపండువగా దీపారాధన**

పీఎం పాలెం: పీఎం పాలెం పరిధి గాయత్రీ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో దీపారాధన నిర్వహించారు. స్థానిక స్మార్ట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో స్థానిక యువతులు పాల్గొని అందమైన రంగవల్లులు వేసి, దీపాలను వెలిగించారు. స్థానిక నాయకులు పోతిన ప్రసాద్, శివకుమార్ పాల్గొన్నారు.



మధురవాడ రైతు బజార్‌లో అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న ఈవో జగదీశ్



పద్మనాభంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు, గిరిబాబు

## నేటి నుంచి ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులు

తగరపువలస: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ఉచిత శిక్షణ తరగతులు చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులను ఆసక్తి గల 8వ తరగతి విద్యార్థులు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ఆర్జేడీ బి.విజయభాస్కర్, డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి, డీఈవో ఎల్.చంద్రకళ హాజరవుతారని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు తెలిపారు.

## విజయనగరానికి బస్సు కోసం వినతి



ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం అందిస్తున్న బసవ కృష్ణమూర్తి

భీమునిపట్నం: భీమిలి నుంచి విజయనగరానికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని ఫోరం ఫర్ బెటర్ భీమిలి అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ విజయనగరానికి రోజూ విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో వెళ్లివస్తుంటారన్నారు. గతంలో విజయనగరానికి బస్సులు ఉండటంతో వారికి సౌకర్యవంతంగా ఉండేదన్నారు. కానీ, అనేక సంవత్సరాలుగా కారణం లేకుండా బస్సులు నిలిపివేశారని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి బస్సు సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

## పౌష్టికాహారంపై అవగాహన, పోటీలు



బహుమతులు అందిస్తున్న సర్పంచ్ సూరినాయుడు

తగరపువలస: పౌష్టికాహార దినోత్సవం సందర్భంగా భీమిలి మండలం మజ్జిపేట జెడ్పీ హైస్కూల్‌లో మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహారం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల దృఢంగా, ఆరోగ్యంగా ఉండవచ్చని సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థినులకు వంటల పోటీలు నిర్వహించి, సర్పంచ్ మజ్జి సూరినాయుడు చేతుల మీదుగా బహుమతులు అందించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ మానిటరింగ్ అధికారి దూడ రమేష్ , ప్రధానోపాధ్యాయిని ఉషారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వెంకటరెడ్డి, మ్యాజిక్ బస్ మెంటార్స్ శారద, దుర్గ, రమ్య, రమణమ్మ, సాయికుమారి తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధపై పరిశోధనలకు గీతంలో భారీ ప్రాజెక్టు

కొమ్మాది: కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యాల్లో భాగంగా కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), మిషన్ లెర్నింగ్ పరిశోధనకు గానూ భారత ప్రభుత్వ శాస్త్రసాంకేతిక విభాగం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి భారీ పరిశోధనా ప్రాజెక్టును మంజూరు చేసింది. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డా. పి.భరణి చంద్రకుమార్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా వ్యవహరించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పరిశోధనలతో పాటు కృత్రిమ మేధ, మెషన్ లెరినింగ్‌లలో టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌ను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నెలకొల్పనున్నారు. ఈ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ ద్వారా దాదాపు 50 స్టార్టప్‌లను విశాఖలో ప్రోత్సహించడంతో పాటు 2026 సంవత్సరం నాటికి కనీసం 20 ఐటీ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తేవాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు డా. భరణి చంద్ర కుమార్ తెలిపారు.

# సమస్యల వలయంలో బీ–2 కాలనీ

- క్షీణించిన పారిశుద్ధ్యం
- సరిగా వెలగని వీధి దీపాలు
- ఇరుకుమార్గంతో ఇక్కట్లు



కాలనీలోని 5వ బ్లాకుకు వెళ్లే ఇరుకు దారి



జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పేరుకుపోయిన చెత్త

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డు పరిధి జేఎన్ఎన్‌యూఆర్ఎం బీ–2 కాలనీలో సమస్యలు నెలకొన్నాయి. కాలనీలోని 16 బ్లాకుల్లో 512 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ కాలనీలోని 5వ బ్లాకులో నివసిస్తున్న కుటుంబాలు తమ ఇంటికి రాకపోకలు సాగించేందుకు కనీసం రహదారి సదుపాయం లేదు. సీసీ రోడ్లు నిర్మించవలసిందిగా స్థానికులు పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.

- కాలనీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. బ్లాకుల నడుమ చెత్త పేరుకు పోయింది. దీంతో దోమలు, ఈగలు చేరడంతో అంటువ్యాధులు సోకుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.
- వీధిదీపాలు పూర్తిస్థాయిలో వెలగకపోవడంతో రాత్రివేళల్లో అంధకారం నెలకొంటోంది.
- కాలనీలో వాడుక నీటి కోసం 3 బోర్లు ఉన్నాయి. అవి సరిపోవడం లేదని, మరో రెండు బోర్లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.
- కాలనీలో అవసరం అయిన చోట సీసీ రోడ్లు నిర్మించాలని, పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచాలని కాలనీ ప్రెసిడెంట్ జీవన్‌ప్రసాద్ కోరుతున్నారు.

## అడుగుకో గుంత..



గతుకులమయంగా ఉన్న రోడ్డు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ నుంచి పనోరమ హిల్స్‌వైపు వెళ్లే రోడ్డు దారుణంగా తయారైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మొత్తం గతుకులమయంగా మారింది. దీంతో అటువైపు వెళ్లాలంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఎండాడ నుంచి పనోరమ హిల్స్, ఐటీ జంక్షన్ వెళ్లేందుకు ఇది దగ్గర మార్గం. ప్రస్తుతం ఈ రోడ్డు గతుకులతో ఉండటంతో పాటు రోడ్డు కిరువైపులా పెద్ద ఎత్తున డెబ్రిస్ వేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

## చంద్రంపాలెం హైస్కూల్ వద్ద అక్రమ బడ్డీలు



హైస్కూలు ఎదురుగా ఫుట్ పాత్ పై ఏర్పాటు చేసిన బడ్డీల్లో ఒక్కటి

మధురవాద: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో అనధికారికంగా బడ్డీలు వెలుస్తున్నాయి. పాఠశాల వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య వస్తున్నందున, అలాగే పాఠశాల పరిసరాలు అధ్వానంగా మారకూడదనే ఉద్దేశంతో స్కూల్ ప్రహరీని ఆనుకుని ఎలాంటి బడ్డీలు ఏర్పాటు చేయకూడదని గత పాఠశాల కమిటీ నిర్ణయించింది. ఈ నిర్ణయంపై అప్పట్లో ఒత్తిళ్లు వచ్చినా, విద్యార్థుల రక్షణ దృష్ట్యా బడ్డీలు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ప్రభుత్వం, కమిటీ మారడంతో ఓ వ్యక్తి అధికార పార్టీ నాయకుల పేరు చెప్పి ఇక్కడ కొత్తగా పుత్‌పాత్ పై అనధికార బడ్డీ ఏర్పాటు చేశాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే నియోజకవర్గ పెద్దల పేరు చెపుతున్నాడని, ఇక్కడి ఇతర చిల్లర వర్తకులు అంటున్నారు. ఇలాంటి వారిని కట్టడి చేయకపోతే మరిన్ని బడ్డీలు వెలసే అవకాశం ఉందని, తక్షణమే ఇలాంటి వాటిని కట్టడి చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.